గురువారం 03-10-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 474 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## పాఠశాల విద్యార్థులతో మోడీ స్వచ్ఛభారత్

### ప్రజలు సైతం పాల్గొనాలని పిలుపు



ముందడుగు జాతీయం:

అక్టోబర్ 2 జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలు సైతం పాల్గొనాలని ఈసందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. 'నేను, నా యువ స్నేహితులతో కలిసి స్వచ్ఛత అభియాన్‌లో భాగమయ్యాను. మీరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను. ఈ చొరవ స్వచ్ఛభారత్ స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుంది' అని మోడీ తన ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రధాని మోడీ పిలుపుమేరకు పలువురు రాజకీయ నాయకులు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్‌రెడ్డి, రాజీవ్‌రంజన్, ముఖేశ్ మాండవీయతో పాటు యూపీ సీఎం యోగీ ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

2014 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ 'స్వచ్ఛ్ భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం మరుగుదొడ్ల నిర్మాణం, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యం.



## ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు

### భారత ప్రభుత్వం ఆదేశాలు

ముందడుగు జాతీయం:

ఇరాన్ భారీ స్థాయిలో ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడుల నేపథ్యంలో ఆ రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం సూచలను జారీ చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దని భారతీయులకు సూచించింది. ఆ దేశంలో ఉన్న భారతీయ పౌరులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. సహాయ సహకారాల కోసం టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, భద్రతా పరిస్థితిలో తీవ్రతను భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. భారతీయ పౌరులు ఇరాన్‌కు అనవసరమైన ప్రయాణాలను

మిగతా 2లో



సన్యాసులుగా మారాలనీ ఎవరిని అడగం

మిగతా 2లో



మెరుగైన సమాజానికి అహింసా మార్గమే అవసరం

మిగతా 3లో




అహింసా మార్గంతోనే అవినీతి రహిత సమాజం

మిగతా 4లో



తెలంగాణలో మొదలైన బతుకమ్మ సందడి పూల రంగులతో ఎరుపెక్కిన పల్లెలు

మిగతా 5లో

## రైల్వే ట్రాక్‌ను పేల్చివేసిన దుండగులు

### ఝార్ఖండ్‌లో జరిగిన ఘటన

ముందడుగు ఝార్ఖండ్:

దేశంలో ఇటీవల రైలు ప్రమాదాలే లక్ష్యంగా ట్రాకులపై రాళ్లు, పేలుడు పదార్థాలు పెట్టిన ఘటనలు ఇటీవల కలకలం రేపిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఝార్ఖండ్‌లో కొందరు దుండగులు దుశ్చర్యకు పాల్పడ్డారు. బొగ్గు రవాణాకు వినియోగించే రైల్వే ట్రాక్‌లో కొంత భాగాన్ని పేల్చివేశారు.

మిగతా 2లో



## తమ దేశంలో మీరు అడుగుపెట్టొద్దు

### ఐరాస చీఫ్‌పై ఇజ్రాయెల్ నిషేదం

### ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి కాట్జ్ ప్రకటన

ముందడుగు జాతీయం:

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తమ దేశంలో అడుగుపెట్టొద్దని ఈ మేరకు ఇజ్రాయెల్ ఆదేశాలు జారీ చేసింది. తమ దేశంపై ఇరాన్

మిగతా 2లో



ముందడుగు
గురువారం, 03-10-2024, హైదరాబాద్

# ఇరాన్‌కు అనవసర ప్రయాణాలు వద్దు

(మొదటి పేజీ తరువాయి)

నివారించాలని సూచించారు. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్న వారు అప్రమత్తంగా ఉండాలని, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని పేర్కొన్నారు. ఇజ్రాయెల్ ముఖ్య నగరమైన టెల్ అవీవ్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా అక్కడున్న భారతీయులకు తగిన సూచనలు జారీ చేసింది. భారత పౌరులు అప్రమత్తంగా ఉండాలని, అనవసర ప్రయాణాలు నివారించాలని, బయటకు రావద్దని, సురక్షిత షెల్టర్లలో ఉండాలని పేర్కొంది.

# రైల్వే ట్రాక్‌ను పేల్చివేసిన దుండగులు

(మొదటి పేజీ తరువాయి)

దీని వెనక క్రిమినల్ ముఠాల హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, ఇది భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో భాగం కాదని అధికారులు వెల్లడించారు.

ఝార్ఖండ్‌లోని సాహిబ్‌గంజ్ జిల్లాలో బొగ్గు రవాణాకు వినియోగించే రైల్వే ట్రాక్‌లో కొంత భాగాన్ని పేల్చేసినట్లు పోలీసుల వెల్లడించారు. ఈ ఘటనలో 470 సెం.మీల మేర ట్రాకు పేలిపోయినట్లు తెలిపారు.

గోడ్డాలోని లాల్‌మాటియా నుంచి పశ్చిమ బెంగాల్ ఫరక్కాలోని తన పవర్ స్టేషన్‌కు బొగ్గును రవాణా చేసేందుకు ఈ ట్రాక్‌ను నిర్వహిస్తున్నట్లు ఎన్టీపీసీ వెల్లడించింది.

# తమ దేశంలో మీరు అడుగుపెట్టొద్దు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన దాడుల విషయంలో యూఎన్ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటన చేశారు.

ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ఇజ్రాయెల్ లో అడుగు పెట్టకుండా నిషేధం విధిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇజ్రాయెల్ పట్ల ఆయన పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని అందుకే ఆంటోనియో గుటెర్రెస్‌ను "పర్సనా నాన్ గ్రేటా"గా ప్రకటిస్తున్నామని తెలిపారు.

పర్సనా నాన్ గ్రేటా ప్రకటన ద్వారా అతడికి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశం ఉండదని స్పష్టం చేశారు. హమాస్, హిజ్బుల్లా, హౌతీలు, ఇరాన్ నుండి వచ్చిన తీవ్రవాదులు, రేపిస్టులు, హంతకులకు ఆయన మద్దతు ఇస్తున్నారని కాట్జ్ ఆరోపించారు. గుటెర్రెస్ యూఎన్ చరిత్రలో ఒక మాయని మచ్చగా గుర్తుండిపోతాడని విమర్శించారు.



# సన్యాసులుగా మారాలనీ ఎవరిని అడగం

## ఆయా వ్యక్తుల వ్యక్తిగత విషయాలు ▪ హైకోర్టు వ్యాఖ్యలపై ఈశా ఫౌండేషన్ స్పందన

ముందడుగు జాతీయం:

ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ తన కుమార్తెకు వివాహం చేసిన ఇతరుల పిల్లలను సన్యాసినులుగా ఎందుకు మార్చాలనుకుంటున్నారని మద్రాసు హైకోర్టు ప్రశ్నించిన విషయం తెలిసిందే. కోయంబత్తూరులో ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ నిర్వహిస్తున్న ఈశా యోగా కేంద్రంలో మహిళలను సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై తాజాగా ఈశా ఫౌండేషన్ స్పందించింది. పెళ్లి చేసుకోమని కానీ, సన్యాసులుగా మారాలని కానీ తాము ఎవరినీ అడగమని స్పష్టం చేసింది. ఇవి ఆయా వ్యక్తుల వ్యక్తిగత విషయాలని పేర్కొంది.

# అక్రమ ఆస్తులు అంటూ తహశీల్దార్‌కు బెదిరింపు

## రూ.3.50 లక్షలు కాజేసిన సైబర్ కేటుగాళ్లు

ముందడుగు నెల్లూరు:

రోజురోజుకు సైబర్ కేటుగాళ్ల ఆగడాలు ఏమాత్రం తగ్గడం లేదు. సాధారణ ప్రజల నుంచి అధికారుల వరకు ఎవరినీ వదిలిపెట్టడం లేదు. తాజాగా నెల్లూరు జిల్లా చేజర్ల మండల తహసీల్దార్ (ఎంఆర్‌వో)కు టోకరా వేసి ఏకంగా రూ.3.50 లక్షలు కాజేశారు. తాము ఏసీబీ అధికారులమని పేర్కొంటూ ఎంఆర్‌వోకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయని.. వెంటనే రూ.5 లక్షలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమకు డబ్బు ఇవ్వకుంటే అక్రమాస్తుల కేసు నమోదు చేస్తామని బెదిరించారు.

దీంతో ఎంఆర్‌వో వారు సూచించిన ఖాతాలకు తన బంధువుల ద్వారా రూ.3.50 లక్షలు బదిలీ చేయించారు. చివరికి అసలు విషయం తెలిసి.. మోసపోయానని గ్రహించిన తహసీల్దార్ వెంటనే సంగం సీఐ వేమారెడ్డికి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా పలువురు రెవెన్యూ శాఖ ఉద్యోగులకు ఇలాగే సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం ఉందని పోలీసులు తెలిపారు.

# హైడ్రాను నడిపిస్తున్నదీ రాహుల్ గాంధీ

## డబ్బు సంచుల కోసమే మూసీ సుందరీకరణ ▪ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

ముందడుగు తెలంగాణ:

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు డబ్బుల కోసమే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అనుమతిచ్చారని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రాహులే వెనకుండి పేదల ఇళ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాను నడిపిస్తోంది సీఎం రేవంత్‌రెడ్డి కాదని.. రాహుల్ గాంధీయేనని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో మీడియాతో కేటీఆర్ మాట్లాడారు.

"కేవలం డబ్బు కోసమే మూసీ ప్రాజెక్టును చేపట్టారు. బుల్డోజర్ ప్రభుత్వంతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే రాహుల్ గాంధీ ఎక్కడున్నారు? ఈ ప్రాజెక్టును ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో త్వరలో బయటపెడతా. కాంగ్రెస్‌కు నోట్ల కట్టలు కావాలి కానీ.. బాధితుల కష్టాలు పట్టవా? ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. లూటిఫికేషన్. దీనిపై డీపీఆర్ కాదు.. ప్రాజెక్టు రిపోర్టు కూడా లేదు.

దీనికోసం డబ్బు ఎక్కడి నుంచి తెస్తారు? ఈ అంశంపై 23 రోజుల్లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తా. సీఎం, మంత్రులకు సయోధ్య ఉన్నట్లు లేదు. ఈ సీఎం.. మంత్రివర్గ విస్తరణ కూడా చేసుకోలేని అసమర్థుడు" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.





ముందడుగు
గురువారం,
03-10-2024,
హైదరాబాద్



# మెరుగైన సమాజానికి అహింసా మార్గమే అవసరం

## చంచల్ గూడ జైల్లో గాంధీ జయంతి వేడుకలు

ముందడుగు హైదరాబాద్:

గాంధీ మార్గాన్ని అందరూ అనుసరించాలని అది వ్యక్తికి, సమాజానికి చాలా మేలని హైకోర్టు న్యాయమూర్తి సుజయ్ పాల్ అన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సంధర్భంగా చంచల్ గూడ జైలులో జరిగిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు జైళ్ల శాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా, న్యాయాధికారి పంచాక్షరి, చంచల్ గూడ జైలు సూపరిండెంటెంట్ శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హింస వైపు వెళ్లడం అనేది బలహీనతకు చిహ్నమని, అహింసా మార్గం అనేది మెరుగైనా సమాజానికి అవసరమని, ఆనాడే గాంధీ గారు ఆచరించి దేశానికి స్వాతంత్రం సంపాదించటంలో కీలక పాత్ర పోషించారని హైకోర్టు న్యాయమూర్తి సుజయ్ పాల్ పేర్కొన్నారు. జైళ్లశాఖ డీజీ డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల జైళ్లకు తెలంగాణ జైళ్లు ఆదర్శమని, ఇక్కడి సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాలు అన్ని రాష్ట్రాల వారు అనుసరిస్తున్నారని, ఇక్కడ సంస్కరణలు నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. ఇటీవలే ప్రభుత్వాన్ని ఒప్పించి సత్ప్రవర్తన కల ఖైదీలను విడుదల చేశామని, జైళ్లలో పనిచేసే ఖైదీల యొక్క వేతనాలు పెంచాలనే సిఫారసులను నిన్ననే ప్రభుత్వం ఆమోదించినదని, తాము నిరంతరం ఖైదీల యందు మార్పుకోసం కృషి చేస్తుంటామని తెలిపారు. అంతకు ముందు జైల్ సూపరిండెంటెంట్ శివ కుమార్ గౌడ్ చంచల్ గూడ జైలు యొక్క వార్షిక నివేదిక సమర్పించినారు. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



# సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించండి

## మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను ఖండించిన నాగార్జున

ముందడుగు హైదరాబాద్:





తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను సినీ నటుడు నాగార్జున ఖండించారు. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలను గౌరవించాలని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. గౌరవనీయ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖగారి వ్యాఖ్యలని తీవ్రంగా ఖండిస్తున్నాను. రాజకీయాలకు దూరంగా ఉండే సినీ ప్రముఖుల జీవితాలని, మీ ప్రత్యర్థులని విమర్శించేందుకు వాడుకోకండి. దయచేసి సాటి మనుషుల వ్యక్తిగత విషయాలని గౌరవించండి. బాధ్యత గలిగిన పదవిలో ఉన్న మహిళగా మీరు చేసిన వ్యాఖ్యలు, మా కుటుంబం పట్ల మీరు చేసిన ఆరోపణలు పూర్తిగా అసంబద్ధం, అబద్ధం. తక్షణమే మీ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాల్సిందిగా కోరుతున్నాను అని ఎక్స్ వేదికగా సినీ నటుడు నాగార్జున తెలిపారు.

### కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు

బీసీ మహిళనైన తనపై అసభ్యకర పోస్టులు పెట్టడం బాధాకరమని కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలను కించపరిచేలా పోస్టులు పెట్టాలని కేటీఆరే ఆ పార్టీ కార్యకర్తలకు చెప్పినట్లు ఉందన్నారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కేటీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన తీరుతో సినీ పరిశ్రమలో కొంతమంది ఇబ్బంది పడ్డారని అన్నారు. కొందరు హీరోయిన్లు త్వరగా పెళ్లి చేసుకుని సినిమా ఫీల్డ్ నుంచి తప్పుకోవడానికి కారణం కూడా కేటీఆర్ అని ఆరోపించారు. అంతేకాదు, నాగార్జున కుటుంబంలో చోటు చేసుకున్న పరిస్థితులకు కూడా కేటీఆర్ కారణమని ప్రస్తావించారు. ఆయన మత్తు పదార్థాలకు అలవాటు పడి, సినిమా వాళ్లకు కూడా వాటిని అలవాటు చేశారని విమర్శించారు. రేవ్ పార్టీలు చేయడంతో పాటు, సినీతారలను ఇబ్బంది పెట్టిన వ్యక్తి కేటీఆర్ అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇది సినిమా పరిశ్రమలో ఉన్న వారందరికీ తెలుసని అన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా ట్రెండ్ అయ్యాయి. మంత్రి సురేఖ వ్యాఖ్యలపై సినీ నటుడు ప్రకాశ్‌రాజ్ కూడా మండిపడ్డారు. "సినిమాల్లో నటించే ఆడవాళ్ళంటే చిన్న చూపా..?' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

# కొత్త పార్టీని ప్రకటించిన ప్రశాంత్ కిశోర్

## 'జన్ సురాజ్ పార్టీ' పేరుతో ప్రకటన

ముందడుగు బీహార్:

'జన్ సురాజ్ పార్టీ' పేరుతో ఎన్నికల మాజీ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ కొత్త రాజకీయ పార్టీని బుధవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించిన ఆయన.. తమ పార్టీ రెండేళ్లుగా క్రియాశీలంగా ఉందని, ఎన్నికల సంఘం నుంచీ ఆమోదం పొందిందని వెల్లడించారు. దీంతో బిహార్‌లో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతుందని అన్నారు. "కొత్త పార్టీని అధికారికంగా ప్రకటించాం. అయితే.. ఈ పార్టీకి నాయకత్వం మాత్రం నా చేతుల్లో లేదు. రెండేళ్లుగా దీని కోసం శ్రమించిన వారే ఈ నిర్ణయం తీసుకుంటారు" అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.



ముందడుగు
గురువారం, 03-10-2024, హైదరాబాద్

# డాక్టర్ అజయ్ అగర్వాల్‌కు జీవితకాల సాఫల్య పురస్కారం




ముందడుగు హైదరాబాద్:

ఇంటర్నేషనల్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ జాతీయ అధ్యక్షుడు, లండన్ బ్రిటిష్ పార్లమెంట్‌లో అంతర్జాతీయ భారత్ గౌరవ్ అవార్డు గ్రహీత డాక్టర్ అజయ్ కుమార్ అగర్వాల్‌కు ప్రతిష్టాత్మక "లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు" లభించింది. కోల్‌కతాలోని ధన్ ధన్య ఆడిటోరియంలో పెద్ద ఎత్తున ప్రేక్షకుల సమక్షంలో డాక్టర్ అజయ్ అగర్వాల్‌కు ఈ అవార్డును అందజేశారు. ముఖ్య అతిథిగా జినేష్ కుమార్, ఐపీఎస్ అమిత్ వర్మ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ధన్వంతి తివారీ సహా ఇతర ప్రముఖులు హాజరయ్యారు.

"మన దేశాన్ని విశ్వ గురువుగా మార్చడంలో యువత పాత్ర" అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆచార్య పూజ్య ముని జినేష్ కుమార్ తన ప్రసంగంలో, భారతదేశంలోని యువత సామర్థ్యాలను వివరించారు. యువశక్తి వ్యవస్థాపకుడు, మేనేజింగ్ ఎడిటర్ సుధాంశు శేఖర్ అతిథులను స్వాగతించారు.




# అహింసా మార్గంతోనే అవినీతి రహిత సమాజం

## యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర



హైదరాబాద్: సమాజానికి అహింసా మార్గాన్ని చూపిన మహనీయుడు మహాత్మా గాంధీ, అవినీతి లేని రాజకీయాన్ని చూపించిన గొప్ప నేత లాల్ బహదూర్ శాస్త్రి అని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం రాజేంద్ర మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం కోసం గాంధీజీ మార్గాన్నే తాము అవలంభిస్తున్నామని అన్నారు. నీతి, నిజాయితీతో విలువల గల రాజకీయాన్ని లాల్ బహదూర్ శాస్త్రి చేసి చూపించారని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ జాతీయ కార్యవర్గసభ్యులు కొమటి రమేశ్ బాబు, వరికుప్పల గంగాధర్, పాశిగంటి వంశీకృష్ణ, కొక్కుల ప్రశాంత్, నాగేంద్ర, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన బాలికల సీబీఎస్ఈ క్లస్టర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్



ముందడుగు హైదరాబాద్:

నగరంలోని సుచిత్ర అకాడమీ, సుచిత్ర బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించిన 'బాలికల సిబిఎస్ఈ క్లస్టర్4 బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ 2024' ఘనంగా ముగిసింది. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఒలింపిక్ పతక విజేతల కోచ్ రమేష్ నాగపురి ముఖ్య అతిథిగా పాల్గొని విజేత లను అభినందించారు. ఈ ఛాంపియన్ షిప్ లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి పలువురు క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా స్ఫూర్తి ప్రదర్శించారు. అండర్14 విభాగంలో 20 పాఠశాలల నుండి 75 మంది విద్యార్థులు , అండర్17 విభాగంలో 15 పాఠశాలల నుండి 41 మంది విద్యార్థులు, అండర్19 విభాగంలో 6 పాఠశాలల నుండి 21 మంది విద్యార్థులు మొత్తం 3 విభాగాల్లో ఈ పోటీల్లో దాదాపు 45 పాఠశాలల నుంచి 137 మంది విద్యార్థులు పోటీ పడ్డారు.

# ఏపీ రాష్ట్ర గవర్నర్‌కు శ్రీశైలం దసరా మహోత్సవాలకు ఆహ్వానం

ముందడుగు హైదరాబాద్:

శ్రీశైల మహా క్షేత్రంలో అక్టోబర్ 3 నుండి 12వ తేదీ వరకు దసరా మహోత్సవాలు ఎంతో వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం విజయవాడలోని రాజ్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ని కలిసి దసరా మహోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ కమిషనర్ ఎస్.సత్యనారాయణ శ్రీశైల దేవస్థానం కార్య నిర్వాహణాధికారి శ్రీ డి. పెద్దిరాజు అర్చకస్వాములు వేద పండితులు గవర్నర్ వారిని దసరా మహోత్సవాలకు ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా గవర్నర్ వారికి వేదఆశీర్వచనంతో శేష వస్త్రాలు, ప్రసాదాలను శ్రీ స్వామి అమ్మవార్ల జ్ఞాపికను అందజేయడం జరిగింది.



ముందడుగు
గురువారం, 03-10-2024, హైదరాబాద్












# తెలంగాణలో మొదలైన బతుకమ్మ సందడి

## పూల రంగులతో ఎరుపెక్కిన పల్లెలు

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణలో బతుకమ్మల సందడి మొదలయింది. 9 రోజులపాటు 9 నైవేద్యాలతో ఈ బతుకమ్మ సందడి నెలకొంటుంది. 9 రోజులపాటు రోజుకు ఒక రకమైన నైవేద్యాన్ని బతుకమ్మకు సమర్పిస్తారు. మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసర్లు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు తొమ్మిది రోజులు బతుకమ్మకు నైవేద్యంగా సమర్పించడం సాంప్రదాయం. మొదటి ఎనిమిది రోజులు ఈ నైవేద్యం తయారీలో యువకులు, యువతులు పాల్గొంటారు. కానీ చివరి రోజు అయిన సద్దుల బతుకమ్మ నాడు మాత్రం నైవేద్యాన్ని మహిళలే తయారుచేస్తారు. 1. ఎంగిలి పూల బతుకమ్మ, 2. అటుకుల బతుకమ్మ, 3. ముద్దపప్పు బతుకమ్మ, 4. నానే బియ్యం బతుకమ్మ, 5. అట్ల బతుకమ్మ, 6. అలిగిన బతుకమ్మ, 7. వేపకాయల బతుకమ్మ, 8. వెన్నముద్దల బతుకమ్మ, 9. సద్దుల బతుకమ్మ, తొమ్మిది రోజులపాటు బతుకమ్మను పూజించిన మహిళలు చివరి రోజైన సద్దుల బతుకమ్మ నాడు చెరువులో నిమజ్జనం చేస్తారు.





